క్లుప్తంగా

స్పందనకు మూడు అర్జీలు

గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు మూడు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ చంద్రసేన్ తెలిపారు. దారి వివాదంపై ఒకటి, భూములకు కొలతలు వేయించాలని ఒకటి, హౌసింగ్‌కు సంబంధించి ఒక అర్జీ వచ్చాయని ఎంపీడీఓ పేర్కొన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడు చక్రాల స్కూటీ పంపిణీ



మూడు చక్రాల స్కూటీని అందజేస్తున్న ఎంపీపీ క్రిష్టయ్య

లింగసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ చేయూతనిచ్చే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగుడికి మూడు చక్రాల స్కూటీని ఎంపీపీ పెన్నా క్రిష్టయ్య సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అన్ని వర్గాలకు చేయూతనిస్తున్నారని, పేదలను అన్ని విధాలా ఆదుకుంటూ ముందుకు సాగుతున్నారన్నారు. ఎంపీడీఓ శేషుబాబు, ఏఓ కట్టా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

10న నులిపురుగుల మాత్రల పంపిణీ



సమావేశంలో పాల్గొన్న అధికారులు

హనుమంతునిపాడు: జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10న నులిపురుగుల మాత్రలు నూరుశాతం పంపిణీ చేయాలని డాక్టర్ మూరక ప్రతాపరెడ్డి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం మండల టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండలంలో 4515 మంది పిల్లలకు మాత్రలు మింగించాలన్నారు. ఎంఈఓ జి.పెద్దిరాజు, ఏఓ జీవి క్రిష్ణారావు, తహసీల్దార్ ఎస్ హరిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ గౌసినీసాబేగం పాల్గొన్నారు.

1539 బేళ్లు విక్రయం

కందుకూరు: కందుకూరు పొగాకు వేలం కేంద్రాల్లో సోమవారం జరిగిన పొగాకు వేలంలో 1539 బేళ్లను విక్రయించారు. వీటిలో కందుకూరు–1వ వేలం కేంద్రంలో 832 వేలానికి ఉంచగా 751 బేళ్లు, కందుకూరు–2 వేలం కేంద్రంలో 855 బేళ్లను వేలానికి ఉంచగా 788 బేళ్లు విక్రయించారు. రెండు వేలం కేంద్రాల్లోను అత్యధిక ధర రూ.270 లభించగా, అత్యల్ప ధరలు వరుసగా రూ.150, రూ.160 లభించాయి.

1152 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరులో వేలంలో పాల్గొన్న బయర్లు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం గ్రామాల రైతులు 1230 బేళ్లు తీసుకురాగా వాటిలో 1,152 కొనుగోలయ్యాయి. 78 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.270, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.257.47 పలికింది. వేలంలో మొత్తం 37 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా అమ్మవారి పాదాల చెంత ఉంచే బంగారు సువర్ణ యంత్రానికి కనిగిచెర్ల వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు, శ్రీనివాసరావు, వెంకటగీతానాగలక్ష్మి దంపతులు రూ.6251 చొప్పున విరాళం అందజేశారు. అలాగే దివంగత ఆకుమళ్ల మల్లికార్జునరావు జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.6251, దోగిపర్తి సుబ్బారావు, సుజాతకుమారిలు రూ.1116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యుడు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. కమిటీ సభ్యులు మాదాల మాల్యాద్రి, చక్కా వెంకట కేశవరావు, బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

2వేల మందికి అన్నదానం

గుడ్లూరు: మండలంలోని పూరేటిపల్లిలో పీర్ల పండుగ ముగిసిన మూడవ రోజు సోమవారం ముస్లింలు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని హిందూ, ముస్లిం ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో షేక్ జిలానీ, నాగూర్, రహంతుల్లా, క్రిష్ణ, పుల్లయ్య, అల్లాభక్షు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



ప్రభుత్వ పథకాల గురించి తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కందుకూరు: రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు సంధానిబాషా అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్ హం సబ్ జగన్ కెసాత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని శ్యామీరపాలెంలో మక్కా మదీనా నూర్ మసీదులో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గురించి వివరించారు. హజ్ యాత్రికులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఉర్దూకి అధికార భాష హోదా కల్పించారని చెప్పారు. ముస్లిం పిల్లల భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రహీం, బాబు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.2.18 లక్షలు



ఆలయ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాత నారాయణరావు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం వరకు రూ..2,18,284 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రు.71,980, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ..30,150, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.91,038, ఆలయం వద్ద నిర్మిస్తున్న మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.25,116 వచ్చినట్లు తెలిపారు. కాగా శాశ్వత అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన అట్లూరి నారాయణరావు డాక్టర్ సౌజన్య దంపతులు రూ.50,116 విరాళం నగదును ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన ఆదినారాయణకు అందజేశారన్నారు. మహాప్రాకార నిర్మాణానికి పొదిలి పట్టణానికి చెందిన పూలుకూరి నాగేశ్వరాచారి, శివకుమారి దంపతులు రూ..25,116 విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మంచికంటి మధు, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు రాకుంటే పేరు తొలగించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ చెంచమ్మ

ఉలవపాడు: పాఠశాలల్లో ఉన్న డ్రాపౌట్లను త్వరగా క్లియర్ చేయాలని ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలించారు. పాఠశాలకు రాకుండా ఉన్న వారిని తొలగించాలన్నారు. ఉపాధ్యాయులు మంచి బోధన అందించాలని తెలిపారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఎంఈఓలు ప్రసాదరావు, రమణయ్యలు బద్దిపూడి, భీమవరం, ఆత్మకూరు, మన్నేటికోట, వీరేపల్లి గ్రామ సచివాలయాలను పరిశీలించారు. వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. విద్యార్థుల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు డ్రాపౌట్లను పాఠశాలకు వచ్చేలా సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



ఉలవపాడులో జరుగుతున్న పోలేరమ్మ పొంగళ్లు

ఉలవపాడు: ఉలవపాడులోని పోలేరమ్మ దేవస్థానంలో జరుగుతున్న పోలేరమ్మ పొంగళ్లలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం తెల్లవారుజామున మహాలక్ష్మమ్మ చెట్టు నుంచిపోలేరమ్మ గుడి వరకు మహిళలు చద్దితో ఊరేగింపు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, తప్పెట్ల మధ్య గ్రామోత్సవం సాగింది. భక్తులు భారీగా పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పూలే బీసీ గురుకుల పాఠశాలల జేడీ అక్కారావు

టంగుటూరు: ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడమే తమ లక్ష్యమని స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ గౌరవ సలహాదారులు, ఆదాయపన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఆలకూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సీ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని పూలే బీసీ గురుకుల పాఠశాలల జేడీ అక్కారావు ప్రారంభించారు. 350 మంది రోగులకు 8 రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, హెచ్ఎం వెంకటేశ్వరరెడ్డి, ఆలం రామారావు, సంస్థ గౌరవ అధ్యక్షురాలు బొడ్డు గ్లోరీ, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న బాలాంజనేయులు

పామూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని ఏపీటీఎఫ్ మండలశాఖ నూతన అధ్యక్షుడు డాక్టర్ పి.బాలాంజనేయులు అన్నారు. స్థానిక 5వ వార్డు పాఠశాలలో సోమవారం ఏపీటీఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్ అధ్యక్షతన నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షునిగా పి.బాలాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా మచ్చా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, జి.నారాయణమ్మ, కార్యదర్శులుగా గంధం వినోద్, ఎం మాల్యాద్రి, టి.అరుణకుమారి, జిల్లా కౌన్సిలర్‌గా ఓంకారం, గంధం ప్రసాద్‌లు ఏకగ్రీవంగా నిమమితులయ్యారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు ఇషాక్, ఖాదర్‌వలి, వెలుగు శ్రీనివాసులు, కే.ఇశ్రాయేలు, బి.శ్రీనివాసులు పలువురు పాల్గొన్నారు.

బావిలో పడ్డ వ్యక్తి

● రక్షించిన పోలీసులు, ఫైర్‌సిబ్బంది



108 వాహనంలో ఉన్న బావిలోపడ్డ వ్యక్తి

పీసీపల్లి: మతిస్థిమితం లేని వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడగా గ్రామస్తుల సమాచారంతో పోలీసులు, ఫైర్‌సిబ్బంది రక్షించారు. ఈ ఘటన సోమవారం రాత్రి మండలంలోని గోపవరపువారిపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో మతిస్థిమితంలేకుండా సంచరిస్తున్న వ్యక్తి సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు బావిలోని నీళ్లలో పడ్డాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన కనిగిరి సీఐ శివరామక్రిష్ణారెడ్డి ఆదేశాలతో స్థానిక ఎస్సై నాగేశ్వరరావు, కనిగిరి ఫైర్ సిబ్బంది హుటాహుటిన బావివద్దకు చేరుకుని బావిలో నీళ్లలో పడ్డ వ్యక్తిని బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. అతనికి చిన్ని చిన్న గాయాలుకాగా ప్రథమచికిత్స అనంతరం 108 వాహనంలో కనిగిరి వైద్యశాలకు తరలించారు. కాగా బావిలోపడ్డ వ్యక్తి కుడిచేయిమీద దుర్గారావు అనే పేరుఉండగా అతను మాట్లాడలేకపోతుండటంతో వివరాలు తెలియరాలేదు.

జాలమ్మ కొలుపుల్లో వరికూటి



సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీలో సోమవారం జాలమ్మ తల్లి కొలుపుల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి వారితో సరదాగా గడిపారు. అంతకుముందు కందుకూరు రోడ్డు సెంటర్‌లోని యన్నాబత్తిన చిన్నా కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లైన్‌మన్‌కు ఘన వీడ్కోలు



జేమ్స్‌ను సన్మానిస్తున్న విద్యుత్ అధికారులు

లింగసముద్రం: మండలంలోని చినపవని 33 కేవి సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న జేమ్స్ రిటైర్డవ్వడంతో సోమవారం చినపవని 33 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యుత్ అధికారులు లైన్‌మన్ జేమ్స్‌ను ఘనంగా సన్మానించారు. కందుకూరు విద్యుత్ ఈఈ వీరయ్య మాట్లాడుతూ లైన్‌మన్‌గా జేమ్స్ చేసిన సేవలను కొనియాడారు. ఏడీ విజయబాబు, కందుకూరు ఏడీ రాఘవేంద్రరావు, ఏఈ ఫిరోజ్, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం

సింగరాయకొండ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని సోమవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నేడు పింఛన్ల పంపిణీ

జరుగుమల్లి: మండలంలోని 6,336 మంది పింఛనుదారులకు మంగళవారం ఉదయం నుంచి పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ కె.జలజాక్షి తెలిపారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో 218 మంది గ్రామ వలంటీర్ల ద్వారా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చర్మకారులు, ఒంటరి మహిళ, డప్పు కళాకారుల, అభయమస్తం, దీర్ఘకాలిక వ్యాధుల పింఛనుదారులకు రూ.1,73,43,500 పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

కనిగిరి రూరల్: ఆటో, బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..వెలిగండ్ల మండలం చోడవరం గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై బేస్తవారిపేట వెళ్తుండగా... ఎదురుగా హెచ్ఎంపాడు నుంచి కనిగిరికి వస్తున్న ఆటో మార్గమధ్యంలో అర్బన్ కాలనీ వద్ద బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఓబులరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానిక ప్రవేట్ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు చేస్తున్నారు.

స్పందనకు 19 అర్జీలు

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన స్పందనలో సోమవారం 19 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కనిగిరి మండలం నుంచి 9, పామూరు 1, హెచ్ఎంపాడు 2, సీఎస్‌పురం 1, మర్రిపుడి 3, కొనకనమిట్ల మండలం నుంచి 2 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారి బసిరెడ్డి జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. వాటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ అజయ్‌కుమార్ తెలిపారు.

మార్కాపురం డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలు

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లో ఈ నెల ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి సోమవారం తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సింగరాయకొండ: విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ ఆలీ సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. ఆగస్టు 10వ తేదీ నుంచి నులిపురుగుల నివారణపై ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందని, 19 ఏళ్లలోపు విద్యార్థినులు తప్పనిసరిగా ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు.

నులిపురుగుల వల్ల విద్యార్థినుల్లో రక్తహీనత సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల జియార్తులు



పీర్ల గుండం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముజావర్లు

పామూరు: మొహర్రంలో భాగంగా 12వ రోజున నిర్వహించుకునే జియార్తుల కార్యక్రమాన్ని ముస్లింలు సోమవారం పీర్ల చావిళ్లవద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముజావర్లు మాట్లాడుతూ పవిత్రయుద్ధం చేస్తూ మహ్మద్ ప్రవక్త అనుచరులు కదనరంగంలో అశువులుబాసిన తీరును స్మరించుకుంటూ వారి త్యాగానికి నిదర్శనంగా 10 రోజుల పాటు మొహర్రం పండుగ వేడుకలు జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా గుండం వద్ద గంధం, పప్పులు, తమలపాకులు, బొరుగులుచల్లి ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. జియార్తులతో మొహర్రం పండుగవేడుకలు ముగిశాయని ముజావర్లు షేక్.ఖాజామొహిద్దీన్ తెలిపారు.

విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎస్ఈ కేవీజీ సత్యాన్నారాయణ

కనిగిరి రూరల్: విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్ ఎస్ఈ కేవీజీ సత్యాన్నారాయణ అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో సోమవారం డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఆగస్టు 10 నాటికి రూ.135 లక్షల విద్యుత్ బకాయిల వసూళ్లు టార్గెట్‌గా చెప్పారు. విద్యుత్ సిబ్బంది అంతా లక్ష్య సాధన దిశగా పనిచేయాలని ఆదేశించారు. కనిగిరి నియోజకవర్గంలో ఆరు మండలాలు, టౌన్ సిబ్బందికి వసూళ్ల లక్ష్యాలను నిర్దేశించారు. 33కేవీ, 11కేవీ లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫెయిల్ అయిన ట్రాన్స్‌ఫారంను విద్యుత్ ఏఈ కచ్చితంగా నూరు శాతం తనిఖీలు చేయాలన్నారు. ఆగిపోయిన, కాలం చెల్లిన మీటర్లను తెలిపిన వెంటనే మార్చాలని తెలిపారు. ఈఈ నాగేశ్వరరావు, ఆరు మండలాలల ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మంచినీరు కలుషితం కాకుండా చూడాలి



స్పందనలో అర్జీ ఇస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: సీజనల్ వర్షాల వల్ల పట్టణంలో సరఫరా అయ్యే మంచినీరు అక్కడక్కడా కలుషితం అవుతుందని, దీనిపై చర్యలు తీసుకుని సక్రమంగా క్లోరినేషన్ చేయించాలని సీపీఎం నాయకులు సబ్‌కలెక్టర్ శోభికకు సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో తెల్లటి పురుగులు, తప్పు వాసనతో నీరు వస్తున్నాయని తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద బ్లీచింగ్ సక్రమంగా కలపడంతో పాటు, పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లీన్ చేయించాలన్నారు. వర్షాల వల్ల సైడ్‌కాల్వల్లో చెత్తా చెదారం పేరుకుపోయి ఉందని, గ్యాంగ్ వర్క్ పెట్టి పట్టణంలోని అన్ని కాల్వల్లో ఒకేసారి శుభ్రం చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులకు కారణమయ్యే దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్, ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సీపీఎం నాయకులు ఎస్ఏ గౌస్, మున్వర్‌సుల్తానా, ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తాం



ఎస్ఈకి వినతిపత్రం అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ కోరారు. స్థానిక విద్యుత్ కార్యాలయానికి వచ్చిన ఎస్ఈకు సత్యన్నారాయణకు సోమవారం విద్యుత్ సమస్యలపై చైర్మన్ గఫార్ వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో దశాబ్దాల కాలం నాటి విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉన్నాయని తెలిపారు. విద్యుత్ స్తంభాలతో వర్షాకాలంలో ప్రమాదాలు వాటిళ్లే అవకాశం ఉందన్నారు. దీంతో స్పందించిన ఎస్ఈ సత్యన్నారాయణ రెండ్రోజుల్లో కొత్త విద్యుత్ స్తంభాలను సరఫరా చేస్తానని, శిథిలావస్థకు చేరిన స్తంభాలను మార్చి వాటి స్థానంలో కొత్త పోల్స్‌ను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే చింతలపాలెంలో లో ఓల్టేజీ విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కందుకూరులో చోరీ



ప్రధాన ద్వారం తలుపుకు రంధ్రం చేసిన దుండగులు



ఇంట్లో పగలగొట్టి ఉన్న బీరువా

● 4సవర్ల బంగారం, రూ.50వేల నగదు అపహరణ

కందుకూరు: తాళాలు వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన సోమవారం పట్టణంలోని మహదేవపురం రోడ్డులో గల జగనన్న కాలనీలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... దిల్షాన్ అనే మహిళ కుమార్తెతో కలిసి పట్టణంలోని మహదేవపురం రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో నివాసం ఉంటుంది. దిల్షాన్ ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో వంట మనిషిగా పనిచేస్తుండగా, కుమార్తె కాలేజీకి వెళ్తుంది. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు డ్యూటీకి వెళ్లి తిరిగి సాయంత్రం 6గంటలకు ఇంటికి చేరుతుంది. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం కూడా ఇంటికి తాళాలు వేసుకుని డ్యూటీకి వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తలుపును కోసి రంధ్రం చేసి ఉంది. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఇంట్లోని రెండు బీరువాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాల్లో ఉండాల్సిన 4సవర్ల బంగారంతో పాటు, రూ.50వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. దీంతో జరిగిన ఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.